# 'అదీ సంగతి...'

"అదిగో... ఆ 'లార్జ్' పెద్దమనిషిని చూశావా?"

"అతనిలో ఏవైనా ప్రత్యేకతలు గమనించావా?"

"ఏదో 'ఠీవి' ఉన్నట్టుంది!"

"అతని పేరు రోజూ పేపర్లలో పడుతుంది."

"ఆహా... గొప్పవాడన్నమాట."

"దాదాపు ప్రతివారం వార పత్రికలన్నీ అతని పేరు ప్రచురిస్తాయి."

"ఓహో... నాయకుడన్నమాట."

"అప్పుడప్పుడు ఫోటో కూడా వేస్తుంటారు."

"ప్రజా నాయకుడు గదా!!"

"రోజుకి లక్షలాదిమంది అతడి గురించి ఆలోచిస్తారు."

"వహ్వా... ఫర్వాలేదే!"

"తాము కూడా, అతనిలా కావాలని ప్రయత్నిస్తారు."

"అంతమందిని ఆకట్టుకున్నాడన్నమాట."

"నన్ను కూడా ఆకర్షించాడు."

"అయితే నిస్సందేహంగా గొప్పవాడే!"

"అతనికి ప్రతిరోజూ వివిధ ఊర్ల నుంచి ఉత్తరాలొస్తుంటాయి."

"ఓహో... గొప్ప 'ఇమేజ్' సృష్టించుకున్నాడన్నమాట."

"అప్పుడప్పుడు రేడియో, టి.వి.లలో పేరు వస్తూంటుంది."

"ఖచ్చితంగా ప్రజా నాయకుడే అతను."

"సినీ జర్నల్స్ కూడా అతడి గురించి ప్రచురిస్తుంటాయి."

"సినీ స్టార్ అయుండాలి."

"చాలామంది రచయితలు అతనంటే భయపడతారు."

"అలాగా! బహుశా విమర్శకుడై వుండాలి."

"వాళ్ళ నుంచి తిడుతూ జవాబులు కూడా వస్తుంటాయి."

"అవును మరి... వాళ్ళకి రాదూ కోపం."

"అందరూ అతని 'రాత'లకి భయపడుతుంటారు."

"ఆహా... ఎడిటర్ కూడానన్నమాట."

"చాలా మంది వాటిని ఆసక్తిగా చదువుతారు."

"అంత బాగా, ఘాటుగా సంపాదకీయాలు రాస్తాడేమో..."

"రెండు, మూడుసార్లు కోర్టుల్లో కేసులు కూడా వేశారు."

"ఎందుకు వేయరు... ఎడిటోరియల్స్ రాస్తుంటాడుగా."

"రెండుసార్లు హత్యా ప్రయత్నాలు జరిగాయి."

"అవును మరి... అంత గొప్పవాడికి విరోధులుండరూ..."

"బతికి బయటపడ్డాడు ఎలాగో వాటినుంచి..."

"ఆ 'దేముడు' గొప్పవాళ్ళని రక్షిస్తాడు."

"అతడు పోస్టల్ డిపార్ట్‌మెంట్‌కి కూడా ఉపయోగపడుతుంటాడు."

"ప్రజా నాయకుడన్న తర్వాత అన్నింటినీ ఉద్ధరిస్తాడు గదా...!!"

"ఇంతకీ అతనేం చేస్తుంటాడనుకుంటున్నావు?"

"బహుశా ఎడిటరో... సినీస్టారో... విమర్శకుడో... ప్రజా నాయకుడో అయివుండాలి."

"అవేమీ కాదు..."

"మరి...!!"

"అతను 'ఉత్తరాల రచయిత' మాత్రమే..."

"ఆ ... ... ...!"

— టి.శశిధరకుమార్

